# హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి

- బీఆర్ఎస్ వెంటే ప్రజలు
- మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే..
- కాంగ్రెస్, బీజేపీవి తప్పుడు ప్రచారం
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా..
- ప్రజా ఆశీర్వాద సభలో చీఫ్ విప్ వినయ్ భాస్కర్



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, నవంబర్ 28 : ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం వరంగల్‌లోని కేఎంసీ మైదానంలో పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలే తన బలం.. బలగం అన్నారు. పదవులు ఉన్నా లేకున్నా నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానన్నారు. కరోనా కష్టకాలం, వరదల సమయంలో వారి కష్టసుఖాల్లో భాగస్వామిని అయ్యానని తెలిపారు. దేనికి బయపడకుండా కేసీఆర్ ఇచ్చిన ధైర్యం, స్ఫూర్తితో తెలంగాణ సాధనే లక్ష్యంగా ముందుకు సాగానన్నారు. తనకు మరోసారి బీ ఫాం ఇచ్చిన సీఎం నమ్మకాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చారు. మూడోసారి కూడా కేసీఆరే సీఎం అవడం ఖాయమన్నారు. కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో నియోజకవర్గాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేశానని తెలిపారు. అలాగే సంక్షేమం, అభివృద్ధి ఫలాలను గడప గడపకూ అందిస్తున్నానన్నారు. ఇప్పటికే నగరం ఐటీ, ఎడ్యుకేషన్, కల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దామని, త్వరలోనే మెడికల్ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసిన దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. దీన్ని ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి హక్కులు కల్పించామన్నారు. ఎన్నికల అనంతరం మిగిలిన వారికి కూడా పట్టాలు ఇచ్చి, గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. భద్రకాళీ ఆలయ మాడ వీధుల నిర్మాణానికి రూ. 30కోట్లు ప్రభుత్వం ఇచ్చిందని, మరిన్ని నిధులు ఇవ్వాలని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం అధికారంలోకి రాగానే మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజలు మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి అడిగినప్పుడల్లా నిధులు ఇచ్చిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్య, వైద్య రంగాల్లో అగ్రస్థానం

- తూర్పులో 7 గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు
- టెక్స్‌టైల్ పార్కులో వేలాది మందికి ఉపాధి అవకాశాలు
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న వరంగల్ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నన్నపునేని నరేందర్

వరంగల్, నవంబర్ 28 : పేద ప్రజలు ఎక్కువగా నివాసం ఉండే వరంగల్ తూర్పు నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోతున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. కేఎంసీ మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గంలో విద్య, వైద్య రంగాలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.1200 కోట్లతో 24 అంతస్తులతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మిస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో అందే వైద్య సేవలు త్వరలోనే ఇక్కడ అందుబాటులోకి రానున్నాయన్నారు. సీకేఎం కళాశాలను ప్రభుత్వ పరం చేసి కేజీ టూ పీజీ విద్యను పేదలకు అందజేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 7 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజవర్గంలోని పేదల ఉపాధి కోసం వరంగల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన పార్టీలు తెలంగాణకు అన్యాయం చేశాయన్నారు. వరంగల్‌లోని ఆజంజాహీ మిల్లును కాంగ్రెస్ పాలకులు అమ్ముకుని 6 వేల మంది కార్మికులను రోడ్డున పడేశారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో వరంగల్ ప్రాంతంలో మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనతో వందేళ్ల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. తూర్పులో 57 వేల మంది మైనార్టీలు ఉన్నారని, వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన సీఎం కేసీఆర్‌ను కోరారు. పేదలు ఎక్కువగా నివసించే వరంగల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాది కల్పించాలని అన్నారు. కాకతీయ సామ్రాజ్య నగరి అయిన వరంగల్‌ను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలన్నారు.

# రెండో సారి గెలుపు ఖాయం

- 51వేల మెజార్టీతో విజయం సాధిస్తా
- కాంగ్రెస్ అభ్యర్థిది నేర చరిత్ర
- ఆయన జైలులో ఉన్నది మరిచారా? : ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, నవంబర్ 28 : నర్సంపేటలో రెండోసారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని, 51వేల మెజార్టీ సాధిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అయిదేళ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధిని చూసిన ప్రజల ఆదరణ బాగుందన్నారు. బోనాలు, బతుకమ్మలతో గ్రామాలు, తండాల్లో పెద్ద ఎత్తున అపూర్వ స్వాగతం పలికారన్నారు. 2018లో 16,700 మెజార్టీతో గెలిచానని, ఇప్పుడు అంతకంటే రెట్టింపు స్థాయి మెజార్టీ వస్తుందని నమ్మకం ఉందన్నారు. నర్సంపేట ఎమ్మెల్యేగా తక్కువ కాలంలో ఎక్కువ నిధులు తెచ్చి అభివృద్ధి చేశానని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డితో పాటు మరొకరు హత్యలు చేసి జైలు పాలైన విషయం మరిచారా? అని ప్రశ్నించారు. తనపై ఒకసారి మాట్లాడితే వీరిపై వందసార్లు మాట్లాడాల్సి వస్తుందని అన్నారు. నర్సంపేటలో రౌడీయిజం, గూండాయిజం లాంటి పనులు చేస్తామంటే కుదరదని చెప్పారు. ప్రజలు ప్రతిపక్ష నాయకుల తీరుతో విసిగిపోయారన్నారు. ప్రజలు శాంతియుతంగా ఉండేందుకు కోరుకుంటున్నారని, అలాంటి వారే తనలాంటి వారికి అవకాశం ఇచ్చారని తెలిపారు. నిధులు తెస్తే కాంగ్రెస్ నాయకులు కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకు వస్తున్నారని, పనులకు అడ్డుపడుతున్నారని చెప్పారు. తాను పంట నష్టపరిహారం తెస్తే దిష్టిబొమ్మలను దహనం చేయించారని, ఆయన అధికార పక్షంలో ఉన్నప్పుడు నర్సంపేటను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా రెండో సారి గెలిస్తే రింగురోడ్డు నిర్మిస్తానని తెలిపారు. పాకాల లైనింగ్ కాల్వల నిర్మాణం కూడా చేపడుతానన్నారు.అభివృద్ధి పనులు కొనసాగాలంటే తాను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు. ఎన్నికల్లో తప్పకుండా తన కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

## కేయూ పరిధిలో కళాశాలలకు రేపు సెలవు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 28 : అసెంబ్లీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం, విశ్వవిద్యాలయ కళాశాలలు, విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ మీటింగ్స్, పరీక్షలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని కూడా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రేపు సాయంత్రం వరకు మద్యం షాపులు బంద్

సుబేదారి, నవంబర్ 28 : ఎన్నికల సందర్భంగా గురువారం సాయంత్రం 5 గంటల వరకు మద్యం షాపులు మూసివేయాలని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ ఆదేశాలు జారీ చేశారు. కోడ్‌ను అతిక్రమించి వైన్స్, బార్‌షాప్‌లు తెరిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా షాపులు తెరిస్తే 0870-2577502, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి 8712658995, టాస్క్‌ఫోర్స్ అధికారి 8712659023 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. కాగా, హనుమకొండలో మద్యం షాపుల మూసివేతపై హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ సీఐ రామకృష్ణ, సిబ్బంది తనిఖీ నిర్వహించారు.

# అభివృద్ధే బీఆర్ఎస్ ఎజెండా

- ప్రగతి పథంలో పరకాల నియోజకవర్గం
- హ్యాట్రిక్ సీఎంగా రికార్డు సృష్టించనున్న కేసీఆర్
- కాంగ్రెస్ మాటలు నమ్మితే గోస పడుతం
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కార్నర్ మీటింగ్‌కు భారీగా హాజరైన ప్రజలు

పరకాల, నవంబర్ 28 : గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో అభివృద్ధే ప్రథమ ఎజెండాగా పాలన చేశామని, పరకాల రూపురేఖలు మార్చామని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల వ్యవసాయ మార్కెట్ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును నియోజకవర్గంలోని గీసుకొండ, సంగెం మండలాల్లో నిర్మించామని, ఇందులో ఇప్పటికే రెండు కంపెనీలు ఉత్పత్తులను ప్రారంభించాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఏండ్లుగా నెలకొని ఉన్న నీటి కష్టాలను మిషన్ భగీరథ ద్వారా తీర్చిందని, ఇంటింటికీ నల్లా నీళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అండగా నిలిచి మరోసారి గెలిపించాలన్నారు. ప్రజలను మోసం చేసేందుకు విపక్షాలు మాయమాటలు చెప్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల దొంగ ప్రమాణాలు, బాండ్ పేపర్లను ప్రజలు నమ్మే రోజులు పోయాయన్నారు. రైతుబంధుపై కాంగ్రెస్ కుట్రలు చేసిందన్నారు. నర్సంపేట, హనుమకొండలో చెల్లని రూపాయి రేవూరి అని మరి పరకాలలో ఏ విధంగా చెల్లుతుందో చెప్పాలన్నారు. ఎన్నికలు రాగానే దొంగ వాగ్దానాలు చేయడం రెండు పార్టీలకు అలవాటేనని, వారి మాటలు నమ్మితే నట్టేట ముంచుతారని పేర్కొన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే మరిన్ని పథకాలు ప్రజలకు అందుతాయని, బీఆర్ఎస్‌కు మరో సారి అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో చల్లా జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, పట్టణాధ్యక్షుడు మడికొండ శ్రీను, నాయకులు బండి సారంగపాణి, రేగూరి జయపాల్ రెడ్డి, సోదా రామకృష్ణ, నల్లెల్ల లింగమూర్తి, నిప్పాని సత్యనారాయణ, దగ్గు విజేందర్‌రావు, పావుశెట్టి వెంకటేశ్వర్లు, గందె వెంకటేశ్వర్లు, చందుపట్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల బందోబస్తుకు సర్వం సిద్ధం

- విధుల్లో 4వేల పోలీసు సిబ్బంది, 1700 మంది కేంద్ర బలగాలు
- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు : సీపీ అంబర్ కిశోర్ ఝా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, నవంబర్ 28 : శాసన సభ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసు శాఖ అన్ని ఏర్పాటు చేసిందని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. హనుమకొండలోని కమిషనరేట్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలతో పాటు పొరుగు జిల్లాల్లోని హుజూరాబాద్, హుస్నాబాద్, భూపాలపల్లి అసెంబ్లీ స్థానాలకు జరిగే ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. వర్ధన్నపేట, పరకాల, జనగామ, పాలకుర్తి, నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్ స్థానాల్లోని 1128 పోలింగ్ ప్రాంతాల్లో 2,126 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని, ఎన్నికల విధుల్లో మొత్తం 4వేల పోలీసు సిబ్బంది, 1700మందికి పైగా కేంద్ర పారా మిలటరీ బలగాలు పాల్గొంటాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు తనిఖీల ద్వారా రూ.12కోట్ల33లక్షల నగదు, రూ.55లక్షల విలువైన మద్యం, రూ.10 లక్షల విలువైన గుడుంబా, రూ.1.64కోట్ల విలువైన గంజాయి, ఆరున్నర కిలోల బంగారం, కిలోన్నర వెండి, రూ.13లక్షల విలువైన బహుమతులు స్వాధీనం చేసుకుని, 842మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. 7,842 మందిని ముందస్తుగా అరెస్ట్ చేశామని, వీరిలో 579మంది రౌడీషీటర్లు ఉన్నారని వెల్లడించారు.

### ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు..

ఎవరైనా ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఎక్కడ కూడా ఒకే చోట ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపుగా ఉండొద్దని, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారం కోసం వచ్చి లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటల్స్‌లో బస చేసిన వారు తమ స్వస్థలాలకు వెళ్లాలని సీపీ సూచించారు. ఇతర కారణాలతో లాడ్జీల్లో ఉన్న వారు సరైన ఆధారాలు చూపాలన్నారు. సమావేశంలో డీసీపీలు అబ్దుల్ బారి, రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.